క్లుప్తంగా

లోవకు రూ.32.48 లక్షల ఆదాయం



తలుపులమ్మ హుండీల నగదు లెక్కిస్తున్న ఈఓ విశ్వనాథరాజు, సిబ్బంది

తుని రూరల్: ఆషాఢమాసం ఉత్సవాలు ప్రారంభమవుతుండడంతో సోమవారం తలుపులమ్మ అమ్మవారి హుండీలను పంచలోహ విగ్రహాల ఆవరణలో తెరచి నగదు లెక్కించామని ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్, కార్య నిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. భక్తులు సమర్పించిన కానుకలు హుండీలు ద్వారా 26 రోజులకుగాను నాణేలు రూ.2,12,363, నోట్లు రూ.30,35,675 వెరసి మొత్తం రూ.32,48,038 ఆదాయం సమకూరినట్టు ఈఓ పేర్కొన్నారు. జంగారెడ్డి గూడెం మద్ది ఆంజనేయస్వామి వారి దేవస్థానం కార్య నిర్వహణ అధికారి ఆర్.వి.చందన, కార్యాలయ సిబ్బంది, చైతన్య గోదావరి బ్యాంకు సిబ్బంది, శ్రీవారి సేవకులు, నాయిబ్రహ్మణులు నగదు లెక్కింపులో పాల్గొన్నారు.

రాజుబాబు మృతి తీరని లోటు

ప్రత్తిపాడు రూరల్: బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గున్నాబత్తుల రాజుబాబు మృతి పార్టీకి తీరనిలోటని ఆపార్టీ కాకినాడ జిల్లా మాజీ అధ్యక్షుడు చిలుకూరి రామ్ కుమార్ అన్నారు. రోడ్డు ప్రమాదంలో మరణించిన ఆయన కుటుంబాన్ని పార్టీ నాయకులతో కలిసి పరామర్శించి విచారం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ రాజుబాబు 20 ఏళ్ల పాటు పార్టీకి విశేష కృషి చేశారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు, మండల అధ్యక్షుడు ఊట వీరబాబు, పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కర్రి ధర్మరాజు, పార్టీ నాయకులు వెలుగుల హరేరామ్, మదినె బాబ్జీ, రామకుర్తి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బోల్తా కొట్టిన ట్రాలీ తరలింపు



తాళ్లూరు పంట కాలువలో బోల్తా కొట్టిన ట్రాలీని బయటకు తీస్తున్న క్రేన్లు

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు శివారులో పంట కాలువలో బోల్తా కొట్టిన ట్రాలీని మరో ట్రాలీపై సంబంధిత వ్యక్తులు తరలించుకుపోయారు. ఐరన్ లోడుతో వరంగల్ వెళ్తున్న ట్రాలీ శుక్రవారం తెల్లవారుజామున డ్రైవర్ నిద్రమత్తు కారణంగా పంట కాలువలో బోల్తాకొట్టిన విషయం పాఠకులకు విదితమే. అయితే సోమవారం రెండు భారీ క్రేన్‌ల సహాయంతో బయటకు తీసి మరో ట్రాలీపై తరలించుకుపోయినట్టు హైవే మెయింటెనెన్స్ సిబ్బంది పేర్కొన్నారు.

ఉత్సాహంగా ఒలింపిక్ రన్

తుని: క్రీడల పట్ల యువత ఆసక్తి చూపాలని టెన్నిస్‌బాల్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి సత్యనారాయణరాజు అన్నారు. సోమవారం స్థానిక రాజా కళాశాల మైదానంలో అంతర్జాతీయ ఒలింపిక్ రన్‌ను విద్యార్థులతో కలిసి ప్రారంభించారు. ఒలింపిక్ జ్యోతితో పట్టణ ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. తుని పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం రన్‌లో పాల్గొన్నవారికి తూర్పు గోదావరి ఆట్యాపాట్యా అధ్యక్షుడు జీవీవీ సత్యనారాయణ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఒలింపిక్ అసోషియేషన్ ప్రతినిధులు కెఎస్.జాబేజ్, విక్టర్‌బాబు, పీఈటీలు ప్రశాంత్, భవాని, లక్ష్మి, రమేష్, ప్రధానోపాధ్యాయులు జి.జయంతి, వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

క్రీడల ప్రాధాన్యతే లక్ష్యం

అన్నవరం: ఒలింపిక్ డే సందర్భంగా సోమవారం అన్నవరంలో క్రీడల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ ఒలింపిక్ రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక సత్యదేవ జూనియర్ కళాశాల మైదానంలో ఈ కార్యక్రమాన్ని దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు ప్రారంభించారు. టైక్వాండో కోచ్ కేవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ వ్యాయామం, ఆటల ప్రాధాన్యత తెలియచేయడమే ఒలింపిక్ రన్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. రన్ ఆంధ్రాబ్యాంక్ సెంటర్ వరకు కొనసాగింది. సత్యదేవ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అరుణకుమారి, లయన్స్ క్లబ్ సభ్యుడు గిరి, హైస్కూల్ హెచ్‌ఎం వేంకటేశ్వరరావు , పీఈటీలు వీరేష్, సూరిబాబు, విశ్రాంత అధ్యాపకులు అప్పారావు, జూనియర్ కళాశాల, శ్రీ శారదా స్కూల్, టైక్వాండో విద్యార్థులు పాల్గొన్నారు.

సర్వే దరఖాస్తులను పరిష్కరించండి

తొండంగి: గ్రామాల్లోని రెవెన్యూ భూముల సర్వేకు సంబంధించి రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని తహసీల్దార్ మురార్జీ సర్వేయర్లను ఆదేశించారు. సోమవారం ఆయన కార్యాలయంలో సర్వేయర్లతో సమీక్షిస్తూ గతంలో నిర్వహించిన సర్వేలో 697 దరఖాస్తులందాయన్నారు. వాటిలో 173 దరఖాస్తులను పరిష్కరించినప్పటికీ మిగిలిన దరఖాస్తులను కూడా త్వరితగతిన పరిష్కరించాలన్నారు. బెండపూడిలో నిర్వహిస్తున్న రీసర్వేను తాత్కాలికంగా నిలిపివేయాలన్నారు.

సేంద్రియ ఎరువులే మేలు

- జీవాల విసర్జితాలతో భూసారం పెంపు
- పొలాల్లో పశువుల మందలను కట్టేందుకు ఆసక్తి
- ఎరువుల ఖర్చులు పెరగడంతో తిరోగమనం
- భూసారం–పంటలు పండేందుకు దోహదం



ప్రత్తిపాడు పొలాల్లో మేస్తున్న గొర్రెల మంద

ప్రత్తిపాడు: భూసారం క్షీణిస్తుండటంతో ఏటా నాలుగు శాతం దిగుబడి పడిపోతోందని నిపుణుల అంచనా. ఒక డిగ్రీ ఉష్ణోగ్రత పెరిగితే 10 శాతం దిగుబడులు ప్రభావితమవుతాయి. పరిమితికి మించి ఎరువులు, క్రిమిసంహారకాలను వాడేస్తున్నందువల్ల నేల సారం హరించుకుపోతోంది. ఈ పరిణామాలు ప్రజారోగ్యాన్ని దెబ్బతిస్తున్నాయి. దీనితో రైతులకు సాగు ఖర్చులు పెరిగి భద్రత లేకుండా పోతోంది. భూసారం పెంపుదలకు సేంద్రియ ఎరువులు, పంట మార్పిడి, పచ్చిరొట్ట పైర్ల సాగు, నవధాన్యాల సాగు వంటి పద్ధతులు ఉపయోగపడతాయి. ముఖ్యంగా జీవాల పెండ భూసారం పెంపుదలకు ఉపయోగపడుతోంది. దీనితో పశువుల మందల విసర్జితాలు పొలాల్లో కలిసేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంత పొలాల్లో ఎక్కడ చూసినా జీవాల విసర్జితాల కోసం ఆవుల మంద, గొర్రెల మందలను పొలాల్లో మేపుతున్న దృశ్యాలు విరివిగా కనిపిస్తున్నాయి.

నియోజకవర్గంలో పరిస్థితి ఇలా..

తక్కువ పెట్టుబడితో లభించే జీవాల ఎరువు అటు భూసారం పెంచుకునేందుకు, ఇటు పంటలు బాగా పండించుకునేందుకు ఉపయోగపడుతుండడంతో చాలా చోట్ల రైతులు గొర్రెల కాపర్లతో మాట్లాడి, మందను పొలాల్లో మేయించుకుంటున్నారు. ఆధునాతన పద్ధతులతో కొత్త పుంతలు తొక్కుతున్న వ్యవసాయ రంగంలో ఇలాంటి పాత విధానాల వైపు రైతులు మక్కువ చూపిస్తుండడానికి కారణం వ్యవసాయ ఖర్చులు తగ్గించుకునేందుకేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఏదిఏమైనా సేంద్రియ ఎరువే పంటలకు మేలని వ్యవసాయ సిబ్బంది రైతులను ప్రోత్సహిస్తున్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి మండలాల్లోని శరభవరం, గజ్జనపూడి, రౌతుపాలెం, ఒమ్మంగి, చింతలూరు, వాకపల్లి, పోతులూరు, పెద్దిపాలెం, వేములపాలెం, ప్రత్తిపాడు, చినశంకర్లపూడి, పెదశంకర్లపూడి, రాచపల్లి, అచ్చింపేట, కొత్తపల్లి, నెల్లిపూడి, సీతంపేట, బంగారయ్యపేట, మండపం, పారుపాక, అన్నవరం కొత్తపేట తదితర గ్రామాల్లో గొర్రెల పెంపకందారులున్నారు. వీరు పరిసర ప్రాంతాలకు చేరుకుని, వేలాది ఎకరాల్లో మంద కట్టడం ప్రస్తుతం జరుగుతోంది. ఇలా గొర్రెల మంద వేసిన వారికి ఒప్పందం చేసుకున్న ప్రకారం సొమ్ములు కానీ ఫలసాయం కానీ ఇస్తారు.

రెండో పంట పూర్తి కాగానే

ఏటా అపరాలు పంటలు నూర్పిడి పూర్తి కాగానే గొర్రెల మందలు పొలాల్లోకి తోలేవారు. అప్పటికే పొలాల్లో మిగిలిన అపరాల మొక్కలు బాగా తిని వాటి పెండను చేనంతా వేదజల్లేవారు. గొర్రెలు, మేకలు వేసిన విసర్జితాలే ఎరువుగా ఉపయోగపడి ఆతర్వాత పండించే పంటలు అధిక దిగుబడులు ఇస్తాయి. ఈ విధానం అటు గొర్రెలు, మేకలకు, ఇటు రైతాంగానికి కూడా ఉపయోగకరంగా ఉంటుంది.

పోషకాహార లోపం

కౌలుదారులు తాత్కాలిక లాభాల కోసం ఆలోచించి ఎరువులు, క్రిమిసంహారకాల వాడకంతో దీర్ఘకాలికంగా భూసారం ఏమవుతుందనే సంగతి వారికి పట్టడం లేదు. ఓ అధ్యయనం ప్రకారం తెలుగు రాష్ట్రాల్లో పొటాష్, మాంగనీస్, జింక్, ఇనుము, బోరాన్ వంటి లోపాలు ఉన్నట్టు తేలింది. 60 శాతం భూముల్లో జింక్ జడలు విప్పుతోందని ఈ భూముల్లో పండించే పంటను తింటే పోషకాహార లోపాలు తలెత్తుతాయని అధ్యయనం పేర్కొంది.

ఆదరణ పెరిగింది



రైతులు ఇచ్చే డబ్బులు గిట్టుబాటు కాకపోయినా మంద వేస్తున్నాం. దూర ప్రాంతాలకు రోజుల తరబడి నడుచుకుంటూ మందలను తోడ్కొని వెళ్తున్నాం. రాత్రిళ్ళు అక్కడే వంట చేసుకుంటూ ఉంటున్నాం. కష్టమైనా జీవాలకు, మాకూ పోషణ దొరుకుతుందని చేస్తున్నాం. ప్రస్తుత రోజుల్లో మందకు ఆదరణ పెరిగింది.

– **మామిడి సత్తిబాబు**, గొర్రెల పెంపకందారుడు, గజ్జనపూడి

ఎరువుల ఖర్చు తగ్గుతుంది



పొలాల్లో గొర్రెలు, మేకల మందలు వేసుకోవడం ద్వారా పంట పొలాలకు ఎంతో మేలు జరుగుతుంది. ఎరువుల ఖర్చు తగ్గడంతో పాటు భూసారం పెరుగుతుంది. పంటలు బాగా పండుతాయి.

– **సేంద్రపు భాస్కరరావు**, రైతు, ప్రత్తిపాడు.

రుణాలిచ్చి ఆదుకోవాలి



గొర్రెలు, మేకలు పెంపకందారుల సంఘాలు ఎన్నో ఉన్నాయి. ప్రతీ ఏటా ఈసంఘాలకు ఆడిట్ జరుగుతోంది. కానీ ఏనాడూ బ్యాంకులు రుణాలు అందివ్వలేదు. ఒక్కొక్క గొర్రెల, మేకల పెంపకందారుని వద్ద పది నుంచి వందల వరకు లక్షల విలువ చేసే జీవాలున్నాయి. గొర్రెల, మేకల పెంపకందారులకు బ్యాంకులు రుణాలిచ్చి ఆదుకోవాలి.

– **గొనగాల శ్రీదేవి**, అధ్యక్షురాలు, (గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం) గజ్జనపూడి,

సజ్జలను కలిసిన సుంకర వీరబాబు



సజ్జల రామకృష్ణారెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న సుంకర వీరబాబు

గోకవరం: గోకవరం వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు తాడేపల్లిలో వైఎస్సార్ సీపీ అధినేత వైయస్ జగన్ మోహన్‌రెడ్డి నివాసంలో సజ్జల రామకృష్ణారెడ్డిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం సమావేశంలో సజ్జల రామకృష్ణారెడ్డితో పాటు పార్టీ రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం చైర్మన్ వెన్నపూస రవీంద్రరెడ్డి ఇతర పెద్దలను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా పార్టీ పరిస్థితులను ఆయనకు వివరించారు. కూటమి వైఫల్యాలపై పోరాటం చేయాలి సజ్జల సూచించారన్నారు. ఆయన వెంట గోకవరం మండల వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

క్రీడాకారులుగా రాణిస్తే ప్రభుత్వ ఉద్యోగాలు

జగ్గంపేట: కాకినాడ ఒలింపిక్ అసోసియేషన్ సౌజన్యంతో జగ్గంపేటలో సోమవారం ఒలింపిక్ 2025 రన్ నిర్వహించారు. రన్‌ను జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం క్రీడా జ్యోతిని వెలిగించి ఒలింపిక్ రన్‌లో పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ప్రారంభం అయిన రన్ గ్రామంలో మెయిన్‌రోడ్డు, ప్రధాన రహదారులు మీదుగా సాగింది. విద్యార్థిని, విద్యార్థులకు సీఐ ప్రశంసా పత్రాలు అందచేశారు. ఆయన మాట్లాడుతూ క్రీడాకారులుగా రాణించి జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు లభిస్తాయన్నారు.

ఫీజుపోరుకు తరలిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



కోటనందూరు నుంచి కాకినాడ వెళ్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

కోటనందూరు: వైఎస్సార్ సీపీ పార్టీ ఆదేశాల మేరకు కాకినాడలో తలపెట్టిన ఫీజుపోరు కార్యక్రమానికి విద్యార్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. సోమవారం ఎంపీపీ లగుడు శ్రీనివాసు ఆధ్వర్యంలో పార్టీ విద్యార్థి విభాగం ప్రతినిధులు, నాయకులు ప్రత్యేక వాహనాలో కాకినాడ తరలివెళ్లి ఫీజుపోరును విజయవంతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గొర్లి రామచంద్రరావు, వాణిజ్య విభాగం కన్వీనర్ వెలగా వెంకటకృష్ణాజీ, సుర్ల రాంబాబు, నల్లమిల్లి గోవిందు, కొరుప్రోలు కృష్ణ, ఉల్లూరి శ్రీను పాల్గొన్నారు.

తొండంగి నుంచి..

తొండంగి: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఫీజు పోరు కార్యక్రమానికి సోమవారం మండలం నుంచి భారీగా యువత కాకినాడ తరలివెళ్లారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా ఆధ్వర్యంలో పెరుమాళ్లపురం, తొండంగి, పి.అగ్రహారం, దానవాయిపేట, అద్దరిపేట, వేమవరం, శృంగవృక్షం, పి.ఇ.చిన్నాయపాలెం, రావికంపాడు, బెండపూడి, యర్రయ్యపేట, ఎల్లయ్యపేట తదితర గ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, యువత భారీగా బైకులపై బీచ్‌రోడ్డు మీదుగా జిల్లా కేంద్రం కాకినాడకు తరలివెళ్లారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బత్తుల వీరబాబు, వైస్.ఎంపీపీ నాగం గంగబాబు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మదదా హేమంత్,జిల్లా కమిటీ సభ్యులు సాపిశెట్టి చిన్న, మండలయూత్‌కన్వీనర్ పప్పుల మూర్తి, వేమవరం సర్పంచ్ మారేటి కృష్ణ, చొక్కా కోదండ, గంగిరి నాగేంద్ర తదితరులు ఉన్నారు.

ఆషాఢ ఉత్సవాలను విజయవంతం చేయండి




ఆషాఢమాసోత్సవాల ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న ఈఓ

తుని రూరల్: ఈ నెల 26 నుంచి జూలై 24 వరకు లోవ దేవస్థానంలో జరిగే తలుపులమ్మ అమ్మవారి ఆషాఢ మాసోత్సవాలకు పెద్ద ఎత్తున తరలివచ్చే భక్తులకు మౌలిక వసతులు కల్పించడంతో పాటు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండ ఏర్పాట్లు చేయాలని పలవురు అధికారులు సూచించారు. సోమవారం లోవదేవస్థానం కార్యాలయంలో కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు అధ్యక్షతన ఆషాఢమాసోత్సవాల నిర్వహణపై సమీక్షా సమావేశం జరిగింది. క్యూలైన్లు, తాగునీరు, వాహనాల పార్కింగ్, అత్యవసర వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండ పటిష్టమైన బందోబస్తు నిర్వహిస్తామని రూరల్ సీఐ జి.చెన్నకేశవరావు, రూరల్ ఎస్సై బి.కృష్ణమాచారి పేర్కొన్నారు. అధికారులు సూచనలు పాటించి అన్ని సదుపాయాలు కల్పిస్తామని, ఐక్యంగా ఆషాఢమాసోత్సవాలను విజవంతం చేయడానికి సహకరించాలని ఈఓ వివిధ శాఖల అధికారులను కోరారు. తహసీల్దార్ జీవీఎస్.ప్రసాద్, ఎంపీడీఓ కె.సాయినవీన్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సత్యదేవునికే టెండర్!

- రూ.45 వేలకే సత్రం దుప్పట్లు ఉతుకుతాం
- దేవస్థానం ఈఓకు స్థానిక రజకుడి దరఖాస్తు
- ప్రస్తుతం నెలకు రూ.60 వేల చెల్లింపు



శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం, అన్నవరం

అన్నవరం: స్థానిక వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలోని సత్రాల గదులలో ఉపయోగించే దుప్పట్లు, గలేబులు, డోర్ కర్టెన్లను నెలకు రూ.45 వేలకే ఉతుకుతామని స్థానిక రజక వృత్తి దారుడు కింతాడ శ్రీనివాస్ దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావుకు సోమవారం వినతిపత్రం సమర్పించారు. నాలుగు నెలలుగా దేవస్థానం వీటిని నెలకు రూ.60 వేల చొప్పున చెల్లిస్తూ ఉతికిస్తోంది. ఎటువంటి టెండర్ పిలవకుండా ప్రజాప్రతినిధి సిఫార్స్ మేరకు నామినేషన్ మీద ఈ పని కేటాయించడం విమర్శలకు తావిస్తోంది. ప్రస్తుతం ఈ అంశం చర్చనీయాంశమైంది.

గతంలో మెషీన్లతో..

దేవస్థానంలో రెండేళ్లపాటు పారిశుధ్య కాంట్రాక్ట్ నిర్వహించిన కేఎల్‌టీఎస్ సంస్థ గత ఫిబ్రవరి నెలాఖరు వరకు సత్రం గదులలో మంచాలపై వేసిన దుప్పట్లు, గలేబులు, డోర్ కర్టెన్లను వాషింగ్ మెషీన్ల ద్వారా ఉతికించేది. పారిశుధ్య నిర్వహణ కాంట్రాక్ట్ కోసం అన్ని దేవస్థానాలకు కలిపి టెండర్ పిలుస్తామని రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి సర్కార్ గత ఏడాది ఆగస్టులో ప్రకటించింది. ఆ మేరకు ఈ ఏడాది ఏప్రిల్‌లో తొలిసారిగా టెండర్ నిర్వహించారు. ఈ టెండర్ దరఖాస్తులో పొందుపరిచిన షరతులపై టెండర్‌దారులు అభ్యంతరం చెప్పడంతో ఆ నోటిఫికేషన్ రద్దు చేసి మరలా 13న టెండర్‌కు పిలిచారు. ఈ టెండర్లు ఖరారయ్యే వరకు దేవస్థానంలో పారిశుధ్య నిర్వహణను నామినేషన్‌పై గుంటూరుకు చెందిన కనకదుర్గా ఏజెన్సీస్‌కి అప్పగించారు. మూడు నెలలుగా ఆ సంస్థ 349 మంది సిబ్బందితో పారిశుధ్య నిర్వహణ చేస్తున్న విషయం, ఆ సిబ్బంది జీతాలు ఆలస్యమవుతున్న విషయం తెలిసిందే. గత మార్చి నుంచి సత్రాలలో దుప్పట్లు, గలేబులు, డోర్ కర్టెన్లు ఉతికేందుకు గాను నాలుగు నెలలుగా నెలకు రూ.60 వేలు చెల్లిస్తున్నారు. అవి ఉతికేందుకు మెటీరియల్‌ను దేవస్థానమే అందజేస్తోంది. ఈ పని కూడా దేవస్థానం అధికారులపై ఒత్తిడి తెచ్చి టెండర్ పిలవకుండా కూటమి పార్టీ నాయకులే చేయిస్తున్నట్లు సమాచారం. కేఎల్‌టీసీ సంస్థ వాషింగ్ మెషీన్ల ద్వారా వీటిని ఉతికించేది. ప్రస్తుతం మనుషులు ఉతుకుతుండడంతో శుభ్రంగా ఉండడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయి.

ట్రిపుల్ ఐటీకి మండల విద్యార్థిని



లంక పూర్ణిమ

కోటనందూరు: కోటనందూరు మండలం కాకరాపల్లి గ్రామానికి చెందిన లంక పూర్ణిమ ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. గత ఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 581/600 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిన పూర్ణిమను నూజివీడు ట్రిపుల్ ఐటీలో ప్రవేశానికి అర్హత సాధించింది. ట్రిపుల్ ఐటీల్లో సీటు రావడం పట్ల తల్లిదండ్రులు, హర్షం వ్యక్తం చేశారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులు

తొండంగి: మండలంలోని ఎ.కొత్తపల్లి జెడ్పీ హైస్కూలు విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారని ఎంఈవో షేక్‌బాబ్జి తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో ప్రతిభకనబరిచిన తొగర పావని షణ్ముఖి, వి.దివ్య నూజివీడు ట్రిపుల్ ఐటీలోనూ, ఎస్.లలిత, కె.గంగా భవాని శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలోనూ సీట్లు పొందారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

పరిశుభ్రతతోనే ప్రజారోగ్యం

శంఖవరం: గ్రామాలను పరిశుభ్రతగా ఉంచుకోవడం ద్వారానే ప్రజారోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని వెలుగు ఏపీఎం శ్రీనువాస్ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నీరు, పారిశుధ్యం, పరిశుభ్రతపై వెలుగు యానిమేటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ గ్రామాల్లో సురక్షితమైన నీరు, పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలకు సురక్షితమైన నీరు అందించాలన్నారు. నాణ్యతా ప్రమాణాలను పెంపొందించాలన్నారు. మరుగుదొడ్లను నిర్మించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీలు వెంకటరమణ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలేశ్వర స్వామికి పూజలు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లిలో వేంచేసియున్న అపీత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి వారికి సోమవారం భక్తులు విశేష పూజలు చేశారు. స్వామి వారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, సామూహిక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వారిని విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. శ్రీరమణా సేవా శ్రమం వ్యవస్థాకులు స్వామి రామానంద ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సత్రం భూముల్ల వేలం వాయిదా

- అయోమయానికి గురవుతున్న రైతులు
- టీడీపీ వర్గాలు సాగు చేస్తున్నాయని ఆరోపణ

జగ్గంపేట: గండేపల్లి మండలం ఉప్పలపాడులోని శ్రీ పైండా వెంకట చలపతి సత్రం భూములు వేలంపాటలు పెట్టడం, మరలా వాయిదా వేయడంపై రైతులు అయోమయానికి గురవుతున్నారు. సోమవారం జగ్గంపేట మండలం కాట్రావులపల్లి పానుగంటి లక్ష్మీ వెంకయ్యమ్మ ధర్మ సత్రంలో వేలం పాటలు ఏర్పాటు చేశారని ఉప్పలపాడుకు చెందిన రైతు సత్తి సోమరాజు తెలిపారు. తీరా వెళ్తే తక్కువ మంది వచ్చారని వాయిదా వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోను ఉప్పలపాడులో సర్వే నెంబర్ 150లో 35.55ఎకరాల భూమికి పాటలు పెట్టారని ఎవరు రాకపోవడంతో వాయిదా వేశారని, స్థానికంగా ఉండే ఓ టీడీపీ నేతకు చెందిన అనుకూల వర్గాల వారు సత్రం భూములలో దుంపసాగు ప్రారంభించారని చెప్పారు. ఒక పక్క దేవాదాయధర్మాధాయ శాఖవారు వేలంపాటలు పెట్టడం ఎవరు రాలేదని వాయిదా వేయడం, మరోవైపు టీడీపీ నేత మనుషులు పొలంలో దుంపసాగు మొదలు పెట్టడంతో ఏం జరుగుతోందో అర్థం కావటంలేదని రైతు సోమరాజు ఆవేదన వ్యక్తం చేశారు. వేలం పాటలకు ముగ్గురుకన్నా తక్కువ వచ్చారు అందుకే వాయిదా వేశామని కాట్రావులపల్లి సత్రంకు, ఉప్పలపాడు భూములకు సంబంధంలేదని ధర్మసత్రం ఈఓ రాంబాబు వివరణ ఇచ్చారు.

108 శివలింగాలకు లింగార్చన

అన్నవరం: జ్యేష్ఠ బహుళ త్రయోదశి (మాస శివరాత్రి) పర్వదినం సందర్భంగా సోమవారం రత్నగిరి దర్బారు మండపంలో 108 శివలింగాలను లింగాకారంలో అమర్చి ప్రత్యేక పూజలు, అభిషేకం ఘనంగా నిర్వహించారు. మట్టితో చేసిన 108 శివ లింగాలకు పాలు తేనె, పళ్లరసాలు, పెరుగు, నేతితో అభిషేకం నిర్వహించారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అర్చకులు ప్రయాగ రాంబాబు, పరిచారకుడు నగేష్ తదితరులు ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

పురోగతులపై ఫ్యాకల్టీకి శిక్షణ



ఫ్యాకల్టీ శిక్షణ ప్రారంభోత్సవంలో పాల్గొన్న జేఎన్‌టీయూ ప్రముఖులు

గండేపల్లి: ఆదిత్య యూనివర్సిటీలో గ్రౌండ్స్ ఇంప్రూవ్‌మెంట్ టెక్నిక్‌ల పురోగతులు అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను సోమవారం ప్రారంభించినట్టు డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ ఎం శ్రీనివాసరెడ్డి తెలిపారు. కాకినాడ జేఎన్‌టీయూ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ డైరెక్టరేట్, జేఎన్‌టీయూ సివిల్ ఇంజనీరింగ్ విభాగం, ఆదిత్య యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం వారం రోజుల పాటు జరుగుతుందన్నారు. భూ స్థిరీకరణ, మట్టి పరంగా సాంకేతిక అభివృద్ధిపై తాజా సమాచారాన్ని అందించేందుకు ఈ వేదిక ఎంతగానో దోహదపడుతుందన్నారు. జేఎన్‌టీయూ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు, ప్రఖ్యాత ఉపన్యాసకులు ప్రొఫెసర్ బి.ఆర్ ఫణికుమార్, తదితరులు పాల్గొని సిబ్బందికి తమ శోధన పరమైన అనుభవాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ఆదిరెడ్డి రమేష్, సివిల్ విభాగాధిపతి రామ్మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధునాతన కమ్యూనికేషన్లపై శిక్షణ

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో అధునాతన కమ్యూనికేషన్లపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను సోమవారం ప్రారంభించినట్టు ప్రో.చాన్సలర్ ఎం. శ్రీనివాసరెడ్డి తెలిపారు. కాకినాడ జేఎన్‌టీయూ, వరంగల్ ఎన్ఐటి సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆదిత్య ప్రొఫెసర్ ఉప్పాడ రాజ్యలక్ష్మి, జేఎన్‌టీయూ కో–కోఆర్డీనేటర్ బి లీలా కుమారి, తదితరులు పాల్గొని అధునాతన కమ్యూనికేషన్ సాంకేతికతలపై అవగాహన కల్పించారు. ఈనెల 27 వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ జి సురేష్, వైస్ ఛాన్సలర్ ఎంబి శ్రీనివాస్, ఎస్ రమాశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం ముంగిట అల్లరిమూకల చేష్టలు





గండేపల్లి సచివాలయం భవనం -2. (అంతర చిత్రం) సచివాలయం ఆవరణలో దర్శనమిస్తున్న తాగేసిన మద్యం, వాటర్ బాటిల్స్

గండేపల్లి: మండల కేంద్రం గండేపల్లిలో హైవేని అనుకుని ఉన్న సచివాలయం–2 అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇందుకు నిదర్శనమే సోమవారం సచివాలయానికి వచ్చిన అర్జీదారులకు (ఉపయోగించి వదిలేసిన) మద్యం సీసాలు, వాటర్ బాటిల్స్, తిను బండారాల ప్యాకెట్లు దర్శనమిస్తున్నాయన్నారు. బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించడం, పొగ తాగడం చేయకూడదని నిబంధనలు ఉన్నప్పటికి తరచూ ఇక్కడే మద్యం సేవిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటి కైన పోలీసులు అల్లరిమూకల చేష్టలు అరికట్టాలని గ్రామస్తులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

తృణప్రాయంగా పదవికి రాజీనామా



ఏలేశ్వరంలో ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ ఉపాధ్యక్షుడు వెంకట్రావు

ఏలేశ్వరం: బీజేపీ ఆధ్వర్యంలో డాక్టర్ శ్యాంప్రసాద్‌ముఖర్జీ వర్ధంతి వేడుకలు సోమవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు ఆధ్వర్యంలో శ్యాంప్రసాద్‌ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవిభజన అనంతరం తూర్పుబెంగాల్, కశ్మీర్‌లో అల్ప సంఖ్యాకులైన హిందువులపై దాడులపై కాంగ్రెస్ వైఖరికి నిరసనగా కేంద్రమంత్రి పదవిని తృణప్రాయంగా రాజీనామా చేశారన్నారు. భారతీయ జనసంఘ్ స్థాపించి కశ్మీర్ పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా ఉద్యమం చేశారన్నారు. శ్యాం ప్రసాద్‌ముఖర్జీ చేసిన సేవలను నేటియువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి నివాళులు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు బీజేపీ కార్యాలయంలో సోమవారం శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని ఆపార్టీ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖర్జీ చిత్రపటానికి బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు శింగిలిదేవి సత్తిరాజు పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం ఆయన ముఖర్జీ జీవిత విషేశాలను వివరించారు. కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు వత్సవాయి రామకృష్ణ జగపతిరాజు, మదినే సూర్యప్రకాషరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయవాదాన్ని ప్రోత్సహించిన ముఖర్జీ

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఊటా వీరబాబు ఆధ్వర్యంలో సోమవారం శ్యాంప్రసాద్ ముఖర్జీ 53వ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖర్జీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ సమైక్యత కోసం పట్టుదలతో పని చేసి దేశంలో బలమైన రాజకీయ ప్రత్యామ్నాయ మార్గం చూపించిన మహోన్నత వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, మండల కార్యదర్శి భాస్కరరావు, పార్టీ నాయకులు నాగేశ్వరరావు, సూర్యనారాయణ, అబ్బు, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుల కృషి ప్రశంసనీయం

ఏలేశ్వరం: ఇటీవల ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనపరచడంతో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌లను సోమవారం ఘనంగా సన్మానించారు. జూనియర్ కళాశాలలో పలువురు స్థానిక నాయకులు ప్రిన్సిపాల్ రాజశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ బాబ్జీలకు శాలువాలు కప్పి పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ ఏడాది కళాశాలలో 93శాతం ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమన్నారు. ఉత్తమ ఫలితాలకు కారణమైన అధ్యాపకుల కృషి ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో బూర్లు సత్తిబాబు, కడింశెట్టి వాసు, చలమయ్య, వైభోగుల సుబ్బారావు, జామి ఆదినారాయణ, బెల్లాని శ్రీను అధ్యాపకులు పాల్గొన్నారు.